

ప్రేమమూర్తి

గంగుల నర్సింహారెడ్డి

చాలా సేపట్నుంచి నాలుక పిడుచ కట్టుకుపోయి, గొంతు ఎండుకుపోయినట్లుగా ఉంది రామలక్ష్మమ్మకు. ఇంటికి మధ్య భాగమైన విశాలమైన అంగణంలో ఓ మూరుమూల చింకి చాపపై, మురికి బట్టల పడకపై అస్తవ్యస్తంగా పడుకొని ఉందామె. అక్కడ పగలు, రాత్రి ఎప్పుడూ చీకటిగానే ఉంటుంది. అందుకే ఎంత పొద్దయిందీ తెలియడంలేదు.

అంగణంలోకి ఎవరైనా వస్తారేమో, వారితో నీళ్లను తెప్పించుకుందామని అడుగుల చప్పుడు కోసం చెవులు రిక్కించి వింటుంది. తొంభై అయిదేళ్ల వయసామెది. కళ్లు కనిపించడం చాలా రోజులయింది.

వాకిట్లో పిల్లలు ఆడుకుంటున్న అల్లరి వినిపిస్తోంది కాని తన పిలుపు వాళ్లకు వినిపిస్తుందా? వినిపించినా ఆ పిడుగులు తన దగ్గరికి వస్తారా? వచ్చినా తను నీళ్లు తెమ్మంటే తెస్తారా? అని ఆలోచిస్తోందామె.

వంటింట్లో ఉన్న కమలను పిలుద్దామా అంటే మనసు జంకుతుంది. "నీ నీళ్లకోసం నన్ను అంత దూరంనుండి రమ్మంటావా?" అని కసురుకొని వెళ్లిపోతుందే తప్ప నీళ్లిచ్చి వెళ్లదు.

వంటింట్లోంచి బజ్జీలు చేస్తున్న కమ్మని వాసన ముక్కు పుటాలకు సోకింది. నోట్లో నీళ్లు ఊరాయి. 'అబ్బ, ఎన్ని దినాలాయె బజ్జీలు తినక' మనసులోనే అనుకుంది. కాని ఆమెకు తెలుసు అవి తనదాకా రావని. ఇన్ని పచ్చడి మెతుకులు తెచ్చి తన ముందు పెట్టడానికే చాలా కష్టపడిపోతున్నట్లుగా కంచాన్ని తన ముందు పగలేసినట్లుగా వెళ్లిపోయే కమల తనకు బజ్జీలు తెచ్చిపెడుతుందా?! అది, దాని పిల్లలు, మొగుడు, దాని అత్త అంతా కలసి తింటారు.

బజ్జీలు పాడుగానూ, అవి లేకుంటేపాయె, ఇన్ని మంచినీళ్లు ఎవరైనా తెచ్చిస్తే బావుండును.

బయట వాకిట్లో ఎడ్లు వచ్చినట్లు వాటి గంటల చప్పుడు, వాటిని గాటిపై కట్టివేయడానికి అదిలిస్తున్న జీతగాళ్ల గొంతులు వినిపించాయి. అంటే పొద్దు మింకిందన్నమాట!

వాకిట్లోకి ఎడ్లు వచ్చాకనే వంటింట్లోకి రమ్మనిచెప్పి పంపించింది పిల్లల్ని కమల. లేకుంటే తమ చేసినవి చేసినట్లు తింటూ, కొట్లాడుకుంటూ పని తెమలనీయరు.

గడువు పూర్తయింది కదా అన్న సంతోషంతో పిల్లలు ఇంట్లోకి పరిగెత్తుకొచ్చారు.

అడుగుల చప్పుడు వినగానే శక్తినంతా కూడదీసుకొని పిలిచింది —

"ఒరే కాంతా!"

"ఏందే తాతమ్మా?" అంటూ దగ్గరికి వచ్చాడు శ్రీకాంతు.

"గిలాసెడు మంచినీళ్లు తీసుకురా నాయినా" దీనంగా అడిగింది.

ఆదీనత్వం ఆ పిల్లవాడికేం అర్థమవుతుంది. అందుకే వాడు "నేను తేను పో" అని వెనుదిరిగాడు.

తరువాతి ఇద్దరు పిల్లల్ని కూడా పేరుపేరున పిలిచింది. కాని ఎవ్వరూ రాలేదు. బజ్జీలు తినే తొందరలో ఉన్నారు వాళ్లు.

బరువుగా నిట్టూర్చిందామె.

ఊపిరాడటం కష్టమనిపిస్తోంది.

తను చనిపోతుందా...ఇప్పుడే తనుచనిపోతుందా?

అబ్బా, అంత అదృష్టమా?! ఇప్పుడే ఇట్లనే పోయినుంటే ఎంత బావుండు?

ప్చ్, తనకిప్పట్లో చావు రాదు. తనపై దేవుడికింకా దయకలుగలేదు. లేకుంటే కన్న కొడుకు పోషణలో హాయిగా కళ్లుమూసి ఉండేది. తను దురదృష్టవంతురాలు కనుకనే కన్నకొడుకు చావును కళ్లారా చూసింది. ఆ తరువాతయినా హాయిగా దాటక పదిహేనేళ్ల నుండి పిల్లందరి చీత్కారంతో బతుకుతోంది.

తను దురదృష్టవంతురాలు.

తను పాపాత్మురాలు.

"పుణ్యం చేసుకున్నోళ్లకు ముసలితనంలో

చెవులు ఋనువడవంట! పాపం చేసుకున్నోళ్ళకు కండ్లు పోతయంటవే, మమ్మల్నందర్ని కష్టపెట్టిన పాపం ఊకెనే పోతదా అందుకే నీకు కండ్లు పోయి నవే పాపపుముండా" అని తిడుతుంది తనను కోడలు చంద్రమ్మ ఇప్పుడు.

తను నిజంగానే పాపాత్మురాలా ? !

ఊరందరి కంటె బాగా బతకాలని తను ఎండనకా, వాననకా, పగలనకా, రాత్రనకా రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి కొడుకు చేత, కోడలి చేత, మనవడిచేతా, ఒళ్లొంచి పని చేయించిందంతా పాపమేనా ?!

బాధగా ఆలోచిస్తోందామె.

మాధవరెడ్డి తండ్రి కొండారెడ్డి చిన్న పిల్ల వాడుగా ఉన్నప్పుడే రామలక్ష్మమ్మకు భర్త చనిపోయాడు. అప్పుడు వారిది ఆ ఊరిలో నిరుపేద కుటుంబం.

ఆమె ఆ చంటిపిల్లానితో ఇక్కడేం ఉంటుంది, తల్లిగారింటికి వెళ్లిపోతుందనుకున్నారు ఊరిలోని వారంతా. కాని అందరి నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఆమె ఆ ఊరిలోనే నిలదొక్కుకుంది. ఈ పనే చేయాలి, ఆ పని చేయకూడదని ఆమె ఏనాడు అను కోలేదు. తనకు చేతనయిన ప్రతిపనీ చేసింది. కూలికి సైతం వెళ్లింది. రాత్రనక పగలనక కష్ట పడింది.

కొడుకు చేతికి ఎదిగి వచ్చాక కూడా ఆమె విశ్రమించ లేదు. "బతకాలి. ఊరిలో అందరికంటే బాగా బతకాలి" అనే కోరిక ఆమెను నిలువ నీయ కుండా చేసింది.

అంబలి త్రాగి కాలం గడిపింది. ఒక్క మిర పొడినే కూరగా ఉపయోగించింది.

ఏదయినా సరే, సంపాదించాలనే కోరికకు అంతుండదు. అందుకే ఎప్పుడూ సంపాదించిన దానితో తృప్తి చెందలేదు. కొడుకుకు పెళ్లి చేసే నాటికి ఆ ఊరి ధనవంతులలో ఒకరయింది.

ఏభై ఏళ్లు వచ్చేంత వరకు కూడా ఆమె కూలీలతో సమంగా పొలంలో దిగి వరినాటేది, కలుపు తీసేది. ఆ సమయంలో అరవై ఏళ్ల కొడుకు జబ్బు చేసి చనిపోయేవరికి గాని ఆమెకు తన వయసు తెలిసి రాలేదు. తాను ముసలి దాన్నైపోయానని ఆమెకు అప్పుడు తెలిసొచ్చింది.

కళ్లు తెలిసినప్పటి నుండి నడుస్తున్న అడుగుల చప్పుడుకు ఆలోచనల నుండి తేరుకుంది

ఇంట్లో ప్రతియొక్కరి అడుగుల చప్పుడు ఆమెకు సుపరిచితమే. "కమలా" అని పిలిచింది.

"ఏంది ? " విసుగ్గా అడిగింది కమల.

అంతటి విసుగులో ఉన్నామెతో తనకు నీళ్లు తెచ్చివ్వమని ఎలా అడగాలి ? అని సందిగ్ధంలో పడి పోయింది రామలక్ష్మమ్మ.

"పిలిచి, మాట్లాడవేందే, ఏం కావాలె ? "

"ఇన్ని మంచినీళ్ళు తెచ్చియమ్మా, గొంతెండుక పోతుంది. "

"గొంతెండుక పోనీకె ఇదేమన్నా ఎండాకాలమా, ఎవరన్నా వింటె నవ్విపోతరు. నీకు మొదట్నుంచి ఇంకొకరికి పని చెప్పడమంటే చాలా ఇష్టం. అందుకే మనిషిని కనబడనీయవు, ఇంత పని చేస్తున్న మాకే దూప అయితలేదు. హాయిగా పండుకున్నదానికి నాలుక ఎండుకపోతుం దంట" అంటూ విసురుగా వాకిట్లోకి వెళ్లి పోయింది.

ఇటువంటి చీదరింపులకు బాధపడకుండా ఏనాడో మొద్దుబారిందామె హృదయం.

కమలకు రామలక్ష్మమ్మ అంటేనే పరమ చిరాకు. ఆ ముసలిదాన్ని ఉదయాన్నే కాలకృత్యాల కోసం లేపి తీసికెళ్లడం, మూడు పూటలా అన్నం తీసుకువచ్చి పెట్టడమంటే ఆమెకు అసహ్యం. కాని తప్పదు కాబట్టి అలాగే . తిట్టుకుంటూ భరిస్తుంది. అదీగాక ఆమెకు పట్నాల్లో ఉండే శుభ్రత అంటే ఎంతో మోజు. పల్లెటూరులో ఉన్న తమ ఇల్లు పట్నం ఇల్లులా శుభ్రంగా ఉండాలని ఆమె ఉబలాటం. కాని ఆ మూలన మురికిబట్టల్లో గత్తు వాసనలో ముడుచుకొని మూలుగుతూ పడుకొని ఉండే రామలక్ష్మమ్మ ఉన్నంతవరకు అది సాధ్యం కాదని ఆమెకు తెలుసు. అందుకే "ఈ ముసలిది ఎప్పుడు చస్తుందిరా దేవుడా" అని దేవుణ్ని ప్రార్థిస్తూ ఉంటుంది.

కమల తిరిగి వంటింట్లోకి వెళ్లిపోయిన చప్పుడు కూడా వినిపించింది.

మళ్లీ ఆలోచనల్లో పడింది రామలక్ష్మమ్మ.

అన్నీ పిచ్చి పిచ్చి ఆలోచనలు.

ఆమె కెప్పుడూ ఒక అనుమానం వస్తుం టుంది. తన బతుకులో సుఖపడే యోగం రాయలేదా భగవంతుడని. పుట్టినప్పటినుండి చచ్చేంతవరకు అన్నీ కష్టాలేనా ? ఇంతమంది ఉన్నా ఆఖరుకు మంచినీళ్లిచ్చే నాథుడు లేకుండాపోయాడే !

మరో బరువైన, ఊపిరాడని నిట్టూర్పు

వరిచేనులో కలుపు తీయించి అప్పుడే పొలం నుండి వస్తూ ఇంట్లోకి ప్రవేశించింది చంద్రమ్మ.

ఆమెకు అత్త రామలక్ష్మమ్మ అంటే ఎంతో కోపం. తనను కాపురానికి వచ్చిన నాటినుండి ఎన్నో కష్టాలు పెట్టిందని ఆమెభావం. నిజంగానే కోడ లును ఒక్క క్షణం తీరికగా కూర్చోనియలేదు రామ లక్ష్మమ్మ. కోడికూసినప్పుడు నిద్రలేస్తే, రాత్రి ఊరంతా సద్దుమణిగాక గాని విశ్రాంతి లభించేది కాదు చంద్రమ్మకు. ఇంటిపనులు, వ్యవసాయం పను లతో ఉక్కిరి బిక్కిరిగా ఉండేది. చెప్పిన పని సరిగ్గా చేయకపోతే రామలక్ష్మమ్మ చంద్రమ్మను కొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆ పైగా ఆమె నోటి దురుసుతనం కూడా చంద్రమ్మను బాధించేది. అందుకే అత్తపై రోజు రోజుకు ఎంతో కసిని. కోపాన్ని పెంచుకుంది.

అయితే అత్త ఇంత కష్టపడినందుకే తామిం తానమయ్యామని చంద్రమ్మ ఏనాడూ తలంచదు. కాపురానికి వచ్చిన నాటినుండి తనతో తీరిక లేకుండా పని చేయిస్తూ రామలక్ష్మమ్మ తిట్టిన తిట్లే జ్ఞాపకం ఆమెకు. అదే కోపాన్ని ఇప్పుడు నిస్సహాయ స్థితిలో ఉన్న అత్తపై ప్రదర్శించి సంతృప్తి చెందుతుంది.

అటువంటి కోడలితో నీళ్లు తెచ్చివ్వమని అడిగితే ఏం ప్రళయం ముంచుకొస్తుందోనని భయపడింది రామలక్ష్మమ్మ. కాని నాలుక పీకుడుకు ఆగలేక ఏమయినా తిట్టనీ దానిష్టం అనుకొని పిలిచింది.

"చంద్రీ !"

వంటింట్లోకి వెళ్తున్నదల్లా ఆగి "ఏందమ్మా అంత ప్రేమగా పిలుస్తున్నావ్ ఏంకావాలే" దీర్ఘాలు తీస్తూ అడిగింది.



తెలుగునేల తొలిరుచులకు
తహతహలాడే తెలుగువారికి
తప్పక చవిచూడాలనిపించే
తెలుగుపచ్చళ్ళు

బిందు
పచ్చళ్ళు

మీరు కోరే పలు రకాల్లో...
✳ మామిడికాయ ✳ నిమ్మకాయ
✳ టొమేటో ✳ అల్లం ✳ గోంగూర
✳ పండుమిరప ✳ ఉసిరికాయ

బిందు కాటేజ్ ఇండస్ట్రీస్
హైదరాబాద్ - 500 890

PLEASE CONTACT FOR
BULK SUPPLIES

NVKR KRIPU

స్త్రీ మూర్తి

"గిలాసెడు మంచినీళ్లు తెచ్చియ్యవే నీకు పుణ్యముంటుంది" వీలయినంత దీనంగా అడిగింది.

ఆ దీనత్వానికి కరుగలేదు చంద్రమ్మ.

"బాగుందే నీ వరుస, నేను వచ్చి బతికి చేసుకున్నించి వచ్చి ఇక్కడ నీకు మళ్ళ సేవ చేయాల్నా? నాకు చేతకాదమ్మా, నేనూ మనిషినే ఆడ కూలోళ్లతో అరచరిచి ఈడికే నా నోరు పోయింది. నీతోని పెట్టుకోవాలంటే నాకు చేతకావద్మా, మూడు పూటలా కడుపునిండా మెక్కి నీవేమైనా కోరికలు కోరుతవు" అంటూ కొంచెం దూరం వెళ్ళి మళ్ళీ ఆగి "ఇన్నాళ్లూ నాతో చేయించుకున్నది చాలలేదే గుడ్డిముండా, ఇంకెంత కాలం సాధిస్తావు నన్ను" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఏడుపొస్తుంది రామలక్ష్మమ్మకు. తను లేవమంటే లేచి, కూర్చోమంటే కూర్చున్న కోడలితో ఇన్నిన్ని మాటలు పడవలసివస్తున్నందుకు... వీలుంటే ఎప్పుడో ఉరేసుకొని చనిపోయేది.

కాని ఏం చేయగలదామె. లేవడానికే శక్తి చాలదు. నిట్టూర్పులు విడుస్తూ కాలం గడుపుతుంది, కాదు కాదు చావుకోసం ఎదురుచూస్తోంది.

ముసలి బ్రతుకే ఓ బరువైన నిట్టూర్పు!

ఇంటిలో వాళ్లవిగాక ఇంకెవరివో అడుగుల చప్పుడు వినిపించేసరికి "ఎవ్వరా?" అంది ఆశగా.

"ఏందమ్మా, నేను మల్లిగాన్ని" అన్నాడు వాడు.

వాడు మాధవరెడ్డి ఆవులను కాసే జీతగాడు.

"ఏంజేస్తున్నవురా ?"

"బర్ల కుడితలకు తవుడు తీస్కపోతున్నమ్మా"

"బిడ్డా వచ్చి నీ కడుపున పుడతా ఓ పని చేస్తావా ?"

"ఏంది చెప్పమ్మా".

"గిలాసెడు మంచినీళ్లు తీస్కరా బిడ్డా గొంతెండుకపోతుంది."

"అట్లనే" అని వాడు ఇంట్లోకి వెళ్లి గ్లాసుతో నీళ్ల తెచ్చి ఇచ్చాడు.

"నీ కడుపు సల్లగుండ" అని గటగటా త్రాగింది.

అప్పుడు ప్రాణం కుదుటపడింది.

"ఇంటి ముందల ఒకరయినా కూర్చోక ఇంట్లో ఏం చేస్తున్నార్రా" అంటూ వచ్చాడు మాధవరెడ్డి

జడ్చర్లలో వడ్లు అమ్మడానికై ఉదయం వెళ్లి ఇప్పుడు తిరిగి వస్తున్నాడతను.

తండ్రి గొంతు విని పిల్లలు పరుగెత్తుకొచ్చారు.

తండ్రి చేతిలోని సంచిని తీసుకొని ఇంట్లోకి పరిగెత్తాడు శ్రీకాంతు.

వడ్లు ఏం ధరకు పోయావో అడుగుదామనుకొని తిరిగి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది రామలక్ష్మమ్మ. వచ్చిన వెంటనే అడిగితే కోపమయితాడని ఊరుకుంది.

అంగీ విడిచి దండెంపై వేసి పెరట్లో ఉన్న బాయి దగ్గరికి నడిచాడు మాధవరెడ్డి.

అతడు తెచ్చిన సంచిలోని కాగితం పాకెట్టును విప్పి లోపలున్న కొత్త జంబుఖానను బయటకు తీసి పరిశీలనగా చూస్తూ "ఈ జంపుఖానాను ఎందుకు తెచ్చినవు, మనింట్ల రెండెక్కువనే ఉన్నయిగా" ఆశ్చర్యంగా అడిగింది భర్తతో.

"ఏదో తక్కువ ధరకు దొరుకుతోందని తెచ్చిన ....ఎట్లయిన నాయినమ్మకు లేదుగద అందుకని" నసిగినట్లుగా అన్నాడు.

"ఆ చచ్చిపోయే ముసలి దానికిప్పుడు జంపుఖానా లేకపోతే నిద్రపడ్తలేదా, నీకేం పనిలేక తెచ్చినవు దీన్ని" వెనుకనే వచ్చిన చంద్రమ్మ అంది.

ఏం మాటాడలేదతను.

అతడు ముందే ఊహించిన విషయం ఇది.

తను జంబుఖానా నాయినమ్మ కొరకే తెచ్చానంటే ఇంట్లో ఇలాంటి నిరసన ఎదురవుతుందని తెలిసినా కొన్నాడు. అంటే అతనికి నాయనమ్మపై ఎంతో ప్రేమ ఉందనికాదు. వడ్లు అమ్మి బస్టాండుకు వస్తున్నప్పుడు రోడ్డు ప్రక్కన జరుగుతున్న వేలంలో ఈ జంబుఖానా చాలా తక్కువ ధరకు పోవడం చూసి అప్రయత్నంగానే తీసుకున్నాడు. తీసుకున్న తరువాత జ్ఞాపకం వచ్చిందతనికి, ఇంట్లో అందరికి సరిపోను రెండు ఎక్కువగానే ఉన్నాయని. అప్పుడే, నాయనమ్మకు ఏంలేని విషయం కూడా స్ఫురణకొచ్చింది. పాతబట్టల బొంతల్లో అసహ్యంగా పడుకొని ఉండే నాయినమ్మకు ఇద్దామని నిశ్చయించుకున్నాడు.

"ఇంటికి వచ్చిపోయే వాళ్లంటరు. ముసల్దిట్ల బొంతల్లో పడుకుంటే చూసెటందుకు బాగుంటదా?" అన్నాడు నచ్చజెప్పుతున్న ధోరణిలో.

ఏమనలేక పోయారు అత్తా కోడళ్లిద్దరు.

కమల వంటింట్లోకి వెళ్లి సాసర్లో బజ్జీలు తీసుకొని వచ్చి అతనికిచ్చింది.

"ఎందుకు చేసినవు?" అందుకుంటూ అడిగాడు

కేన్సరు పోరాటంలో అభివృద్ధి !

జపానులోని కేన్సరు పరిశోధకులు కేన్సరు నిర్మూలనకు జరుపుతున్న పోరాటంలో కొంత అభివృద్ధిని సాధించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రేడియలాజికల్ సైన్సెస్ వారు పదకొండుమంది కేన్సర్ రోగులకు ప్రోటాను కిరణాలతో చికిత్స జరిపారు. వారిలో ఏడుగురికి కేన్సరు పూర్తిగా తగ్గిపోగా, మిగిలిన నల్గురికి చెప్పుకో తగినంతగా తగ్గింది. ప్రస్తుతం జపానులో న్యూట్రాను చికిత్స బాగా అమలులో వున్నది. అయితే న్యూట్రాను కిరణాలు ప్రక్కనున్న ఆరోగ్యకరమైన కణాలను, టిష్యులకు హాని కల్గిస్తాయి. ప్రోటాను కిరణాలు కూడా హాని కల్గిస్తాయి కానీ, యిది చాలా తక్కువ. ప్రోటాన్లు విద్యుదావేశము కలవి. అందువలన అవి నేరుగా కేన్సరు భాగాలను తాకగలవు. ఎక్సరే, గామా కిరణాల సహాయంతో, చుట్టు ప్రక్కలగల ఆరోగ్యకరమైన కణాలకు కలిగే హానిని తగ్గించారు.





"పొద్దు మింకెల పిల్లలు ఊరికే అడిగితే తేసిన"

"నాయినమ్మకు పెట్టినావా?"

"ఎన్నడు లేంది నాయినమ్మమీద శాన ప్రేమ పుట్టుకొచ్చిందే" నవ్వుతూ అంది కమల.

'ఆమెకు పెడ్తే ఎందుకు చేసింర్రా, మీకేం పనిలేదు, ఖర్చు దండుగ అని పురాణం సదువుతదిరా" అంది చంద్రమ్మ.

ఇంకేమంటాడతను ?

తిని, జంబుఖాను తీసుకొని అంగణంలోకి వచ్చి రామలక్ష్మమ్మ దగ్గరికి వెళ్లాడు.

"తిన్నావా నాయినమ్మా?"

బదులుగా మెల్లిగా మూలిగి "పాణం బాగలేదు నాయినా, పయి తిరుగుతున్నట్లుంది, అందుకే తిన్లే. అవును కాని వడ్లు ఏం ధరకు పోయినయి?" తన ఆరోగ్యం కన్నా ఈ వ్యవసాయపు విషయాలే ఎక్కువ ఉత్సుకత ఆమెకు.

"మూటెంపై రూపాయలకే అమ్మినే, నలిస్తే నూకలయినయి"

"యాసంగి వడ్లు ఎక్కువ ఎండపెట్ట కూడదంటే యిన్నావా."

"అవును అప్పుడు ఎక్కువ ఎండబెట్టింది తప్పయింది, కొంచెం ప్రక్కకు జరిగి పండుకో నాయినమ్మా ఈ జంపుఖానా పరుస్తా."

"జంపుఖానా? ఎందుకురా?" ఆశ్చర్యంగ అడిగింది.

"నీకోసం కొత్తది తెచ్చిన."

"ఇయ్యాల్నో రేపో చచ్చేదానికి నాకెందుకు నాయినా కొత్త బట్టలు, వద్దుపో, మీరే తీసుకోండి"

"మా కందరికీ ఉన్నవే, ఇది నీ కోసమే తెచ్చిన."

"అట్లయితే ఇంట్లదాచిపెట్టు, ఎవరన్నా చుట్టాలొస్తే అవసరానికొస్తది."

"చెప్తే వినవు, నీ పక్కేసిదా, ఇంట్ల రెండు ఎక్కువనే ఉన్నయి" అంటూ ఆమెను ప్రక్కకు జరిపి చక్కగా పరచి తిరిగి ఆమెను పడుకోబెట్టాడు.

స్త్రీ మూర్తి

ఆ మాత్రానికే ఎంతో సంబరపడింది ముసలిప్రాణం.

మాధవరెడ్డికి కూడా రామలక్ష్మమ్మంటే ఇప్పటికీ ఎంతో కోపం. ఎప్పుడో, ఏ క్షణానో అరుదుగా జాలికలుగుతుందామెపై.

చనిపోయే ముందు తండ్రికిచ్చిన మాటకోసం తన కోపాన్ని దిగమింగుకుంటాడతను.

మాధవరెడ్డి చదువులో మంచి తెలివి గలవాడే, పదవ తరగతిలో పాసయ్యాక ఇంటర్మీడియట్‌కు జడ్చర్ల వెళ్తానన్నాడు. కాని రామలక్ష్మమ్మ ఒప్పుకోలేదు. ఆమె ఉద్దేశ్యం వేరు. ఉన్న ఒక్కగానొక్క మనుమడు చదువుకుంటే ఈ వ్యవసాయం చేయలేడు. ఉద్యోగం చేస్తానంటూ దేశాలు పట్టిపోతాడు. అప్పుడు తానిన్ని రోజులు కష్టపడి సంపాదించిన దంతా ఎవరిపాలో అవుతుంది. అందుకే ఒప్పుకో లేదామె. తండ్రి ముందు ఏడిస్తే "మా నాయినమ్మ ఖర్మం రా" అని తప్పించుకున్నాడు.

ఆదే పెద్దకోపం అతనికి రామలక్ష్మమ్మపై. తానప్పుడే చదువుకొని ఉంటే ఏదో ఉద్యోగం చేసుకుంటూ హాయిగా ఉండేవాడు. ఇప్పుడిలా అనుక్షణం కష్టపడే దుర్గతి తప్పేది. ఈ విషయం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఆమెను గొంతు పిసికి చంపేద్దామన్నంత కోపం వస్తుంటుందతనికి.

* * *

ఇప్పుడు మాధవరెడ్డి కుటుంబం హాయిగా అనుభవిస్తున్న యావదాస్తి యొక్క అణువణువులోనూ రామలక్ష్మమ్మ శ్రమ ఫలం దాగి ఉన్నా ఆమె అంటే —

తనను సాధించి, హింసించి, రాచిరంపాన పెట్టిందని చంద్రమ్మకు కోపం. తను చదువుకొని ఉద్యోగంచేయకుండా, కష్టపడే రైతులా చేసిందని మాధవరెడ్డికి కోపం. సేవలు చేయలేక, ఇల్లు అసహ్యంగా తయారవుతుందని కమలకు కోపం. పెద్దవాళ్లందరికీ కోపం కాబట్టి పిల్లలకూ చులకనే!

అయితే తినకెందుకింకా చావురాదని రామలక్ష్మమ్మకు తన పైనే తనకు కోపం.

"నేను ఇంకెందుకు బతికుండాలి దేవుడా, జల్ది తీసుకపో" రోజులానే దేవున్ని ప్రార్థించి బలమంతాను కళ్లు మూసుకుంది.

* * *

"మాధవా, లేవు నాయినా" అంటూ తల్లి గొంతు కంగారుగా వినిపిస్తూ, తలుపు తట్టిన శబ్దానికి లేచి, త్వర తలుపు తెరుచుకొని అంగణం లోకి వచ్చాడు మాధవరెడ్డి. అతని వెనుకే కమల కూడా లేచివచ్చింది.

"ముసల్ది వచ్చినట్లుందిరా, పలుకుతలేదు."

వేగంగా దగ్గరికి వెళ్లాడు.

రామలక్ష్మమ్మ అచేతనంగా పడివుంది.

వంగి ముక్కుదగ్గర చేయిపెట్టి, ఆ తరువాత ఒళ్లుతాకి చూసి లేచి "చచ్చిపోయింది" అన్నాడు.

అప్పుడు కనిపించిందతనికి తను రాత్రి తెచ్చిన కొత్త జంబుఖాన, ఆమె క్రింద పడకపై ఉండాల్సిన ఆ జంబుఖానా ఆమెకు కొంచెం దూరంలో కూడదీసుకున్న శక్తితో తోసివేసినట్లుగా కుప్పగా అస్తవ్యస్తంగా పడి ఉంది.

"ఎందుకమ్మా, నాయినమ్మ ఈ జంపుఖానను ఇట్లా దూరంగా తోసింది?" అయోమయంగా అడిగాడు తల్లిని.

ఒక్క క్షణం ఆలోచించి "చచ్చిపోయినవాళ్లు కప్పుకున్న బట్టలు, పడకమీదున్న బట్టలు చాకలోళ్లు తీసుకుంటరు. తను చచ్చిపోతున్నానని తెలిసుంటుంది ముసలిదానికి. అందుకే కొత్త జంపుఖానా చాకలి వాండ్లకు పోనీయకూడదని చచ్చిపోయేముందు ఇట్ల దూరంగా జరిపుంటది..." అప్రయత్నంగా ఆమె కంఠం రుద్ధమై కళ్లనిండా కన్నీరు కమ్మింది.

మాధవరెడ్డికి కూడా ఈ మాటలు వినేసరికి ఎలాగో... ఎక్కడో హృదయంలో అవ్యక్తమైన బాధ కలుక్కుమంది.

రామలక్ష్మమ్మ చావుకోసం ఇన్నాళ్లుగా ఎదురు చూస్తున్న కమలైతే బావురుమని ఏడ్చేసింది.

కొత్త జంబుఖానను చాకలివాళ్లకు పోనీయ కుండా చేశాననే తృప్తితో నిండుగా ఉంది రామలక్ష్మమ్మ వదనం!